
ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.19, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 40, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 13, క్యారెట్ 33, దొండ 28, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 40, గోకరకాయ 28, కీర 18, దోసకాయ 23, బీట్‌రూట్ 31, ఉల్లిగడ్డ 34, ఆలుగడ్డ 23, చామగడ్డ 38, మొరంగడ్డ 21, కందగడ్డ 50, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 13, మునగకాయ 4–6, ముల్లంగి 4–6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



సనత్‌నగర్: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ వరలక్ష్మీ వివరాల ప్రకారం..బేగంపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ బస్టాప్ సమీపంలో దాదాపు 55 ఏళ్ల వయస్సున్న ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండడంతో స్థానికులు గమనించి 108 వాహన సిబ్బందికి సమాచారం అందించారు. బేగంపేట పోలీసుల సహకారంతో సదరు వ్యక్తిని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు.





లష్కర్, సనత్‌నగర్‌పై పజ్జన్న, సీనన్నలది ప్రత్యేక ముద్ర

- స్థానికులకు టికెట్ దక్కినా వరించని విజయం
- హ్యాట్రిక్‌తో చరిత్ర సృష్టించిన పద్మారావు, తలసాని

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఓటు హక్కు కలిగిన వారెవరు కూడా ఇప్పటి వరకు ఇక్కడ ఎమ్మెల్యేగా పని చేయలేదు. 1972 నుంచి ఇప్పటి వరకు ఈ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహించిన నాయకులు ఎవరికీ ఇక్కడ ఓటుహక్కు లేకపోవడం గమనార్హం. ఇక్కడ ఎమ్మెల్యేలుగా కొనసాగిన వారిలో ఎక్కువ మంది సనత్‌నగర్ నియోజకవర్గానికి చెందిన వారే. మరి కొందరు కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందినవారు ఉండగా ఒకమారు ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహించిన ప్రముఖ సినీనటి జయసుధ మాత్రం శేరిలింగంపల్లి నియోజకవర్గ ఓటరు కావడం గమనార్హం. శాసనసభ ఎన్నికలు వచ్చాయంటే స్థానిక ఏ పార్టీ టికెట్ ఎవరికి దక్కుతుందా అన్న చర్చలు సహజంగా జరుగుతుంటాయి. కానీ సికింద్రాబాద్ నియోజకవర్గంలో మాత్రం స్థానికంగా వివిధ పార్టీల్లో పలువురు నాయకులు ఉన్నప్పటికీ టికెట్ దక్కించుకుని ఏ నాయకుడు ఇక్కడ పోటీ చేయడానికి వస్తారా అని ఎదురుచూపులు ఉంటాయి. ఇందుకు కారణం 2018 శాసనసభ ఎన్నికల వరకు ప్రధాన రాజకీయ పార్టీలు ఏవీ ఇక్కడి నాయకులు టికెట్ ఇవ్వలేదు. ఫలితంగా సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఏ మూలన వెదికినా మాజీ ఎమ్మెల్యేల జాడ కనిపించలేదు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి పోటీ చేయడం, ఓటమి పాలవ్వగానే తిరిగి వెళ్లిపోవడం నేతలకు పరిపాటిగా మారింది.

సనత్‌నగర్ నీడలు...

సికింద్రాబాద్ ఎమ్మెల్యేలుగా ప్రాతినిథ్యం వహించిన వారిలో ఎక్కువ మంది సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాలకు చెందిన వారే ఉన్నారు. ఇదిలా ఉండగా ఇక్కడ జరిగే ప్రతీ ఎన్నికపై మొత్తంగా పక్కనే ఉన్న సనత్‌నగర్ నియోజకవర్గ రాజకీయ ప్రభావాలు ప్రత్యక్ష, పరోక్షంగా ఉంటాయి. 2004, 2008 (ఉప ఎన్నిక), 2014, 2018 శాసనసభ ఎన్నికల్లో రెండు ప్రధాన పార్టీల నుంచి తలపడి విన్నర్, రన్నర్‌గా నిలిచిన నేతలంతా సనత్‌నగర్‌కు చెందిన వారే. పద్మారావుతో తలసాని (టీడీపీ), కూన వెంకటేశ్‌గౌడ్ (టీడీపీ), కాసాని జ్ఞానేశ్వర్ (కాంగ్రెస్) ఇలా పోటీదారులు విజేతలు, పరాజితులు అందరు సనత్‌నగర్ నేతలు కావడం ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.

ఎక్కువ కాలం వీరే..

సికింద్రాబాద్ నియోజకవర్గానికి ఎక్కువ కాలం కొనసాగిన ఎమ్మెల్యేలుగా తీగుళ్ల పద్మారావుగౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రత్యేకతను చాటుకున్నారు. సనత్‌నగర్ నియోజకవర్గం మోండా మార్కెట్ ప్రాంతంలో పుట్టిపెరిగిన వీరిరువురు తమ తమ నాయకత్వ పటిమతో లష్కర్ ప్రజల్లో చెదరని ముద్ర వేసుకున్నారు. ఇక్కడి నుంచి టీడీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఐదు సార్లు పోటీచేసి మూడు సార్లు గెలుపొందారు. మరోమాజీ మంత్రి, తాజా ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఐదు సార్లు తలపడి నాలుగు సార్లు విజయం సాధించారు. సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచిన వారిలో కేఎస్ నారాయణ, ఎల్ నారాయణ, అల్లాడి రాజ్‌కుమార్, అల్లాడి రాజ్‌కుమార్ కూడా సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాలకు చెందిన వారే.

తొలిసారి స్థానికులకు..

సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు ఈ మారు తొలిసారిగా రెండు జాతీయ పార్టీలు స్థానికులకు టికెట్‌ను కేటాయించి కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టాయి. కాంగ్రెస్ టికెట్‌ను ఇక్కడి సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తుకారాంగేట్ వాస్తవ్యుడు ఆదం సంతోష్‌కుమార్‌కు కేటాయించారు. బీజేపీ టికెట్‌ను మధురానగర్ వాస్తవ్యుడు సీనియర్ బీజేపీ నాయకుడు మేకల సారంగపాణికి అందించారు. వీరిద్దరికీ అపారమైన రాజకీయ అనుభవం ఉంది. ఆదం సంతోష్‌కుమార్ సతీమణి ఉమాదేవి రెండు మార్లు, మేకల సారంగపాణి సతీమణి సుజాత ఒకమారు మున్సిపల్ కార్పొరేటర్లుగా గెలుపొందారు. ఈ సారి మాత్రం మొదటిసారిగా సనత్‌నగర్ ఓటరైన పద్మారావుగౌడ్‌తో ఇరువురు సికింద్రాబాద్ ఓటర్లు ప్రత్యర్థులుగా తలపడ్డారు.

ఫలించని ప్రచారాలు....

స్థానికులను ఆదరించాలని కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఈ ఎన్నికల సందర్భంగా విస్తృతంగా ప్రచారం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆదం సంతోష్‌కుమార్ తాను తుకారాంగేట్‌లో పుట్టానని తనకు ఒకమారు అవకాశం ఇవ్వాలని పలుమార్లు తన ప్రచారంలో వేడుకున్నారు. చరిత్ర మొత్తంగా బయటి వ్యక్తుల పాలన నడుస్తుందని ఈ మారు తనను గెలిపించి స్థానికుడికి అండగా నిలవాలని కోరారు. వీరి స్థానికత ప్రచారాల గురించి ప్రజలు, విశ్లేషకుల్లో చర్చలు కూడా సాగాయి. స్థానిక నాయకులకు తొలిసారి టికెట్లు లభించాయని పలువురు హర్షం వ్యక్తం చేశారు. అయినప్పటికీ మళ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు లష్కర్ ప్రజలు పట్టం కట్టారు. దీంతో ఈ మారు స్థానికులకు రెండు జాతీయ పార్టీల టికెట్లు లభించినా స్థానికులు ఎమ్మెల్యేగా గెలిచే అవకాశం మాత్రం దక్కలేదు.

బీజేపీ ఓటమికి అత్యుత్సాహమే కారణమా?

రసూల్‌పురా: కర్షుడి చావుకు పలు కారణాలున్నట్లు బీజేపీ అభ్యర్థి శ్రీగణేష్ ఓటమికి పలు కారాణాలున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బీజేపీ నాయకుల అత్యుత్సాహమే ఆ పార్టీ అభ్యర్థిని ఓటమికి కారణమైందంటూ ప్రచారం జరుగుతోంది. ఎన్నికలు రాక ముందు దళితబంధు, డబుల్ బెడ్రూమ్ విషయంలో అవినీతి జరిగినట్లు తెలిసినట్లయితే ఎందుకు బయటపెట్టలేదని నామినేషన్ వేసి ప్రచారం జరుగుతున్న సందర్భంలో బీఆర్‌ఎస్ అభ్యర్థికి చెందిన వీడియోలు మొదటిసారి రిలీజ్ చేయించడం బీజేపీకే మైనస్ అయిందని ప్రజల్లో బీజేపీ పార్టీ పట్ల విముఖత పెరిగిందని పేర్కొంటున్నారు. బీఎస్. శ్రీనివాస్ బానుక మల్లిఖార్జున్ ఇతర నాయకులు పలుమార్లు మీడియా సమావేశం ఏర్పాటు చేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్య నందితపై తీవ్ర ఆరోపణలు చేస్తూ సవాల్ చేయడంతో వీరి పార్టీ అభ్యర్థి ప్రతిష్ట మరింత దిగజారిందని పలువురు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు.

ఆ నాయకుడి దురుసు ప్రవర్తన కారణమా?

మూడో వార్డులో ఓ నాయకుడు ఓటర్లు, కార్యకర్తలు, నాయకుల పట్ల దురుసుగా ప్రవర్తించడంతో పాటు నేనే ఇన్‌చార్జి నేను చెప్పినట్లు ఎన్నికల ప్రచారం జరగాలని ప్రచార ర్యాలీలు రద్దు చేయించడం, ఇక రెండవ వార్డుకు చెందిన మరో నాయకుడు బోర్డు నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ నుంచి పూర్తి సహకారం అందకపోవడంతో పాటు అతని అనుచర వర్గానికి బూత్‌లు కేటాయించకపోవడం కూడా ఓ కారణమని పార్టీ కార్యకర్తలు గుసగుసలాడుకుంటున్నారు. ఇక ఒకటో వార్డు విషయానికొస్తే అక్కడ మరో నాయకుడికి చెందిన ప్రధాన అనుచర గణం బీజేపీ అభ్యర్థికి పనిచేయడం ఇష్టం లేక బీఆర్‌ఎస్‌కు పని చేశారు. దీంతో పాటు బీజేపీ నాయకులు లాస్యకు సంబంధించిన వీడియోలు రిలీజ్ చేయడంతో బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీ అభ్యర్థి శ్రీ గణేష్ గత కేసుల వివరాలతో కూడిన సమాచారాన్ని తెలుగు, తమిళ్, ఇంగ్లిషు, హిందీ, ఉర్దూ బాషాల్లో వేలాది వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ చేయడం కూడా శ్రీ గణేష్ ఓటమికి కారణమని తెలుస్తోంది. నిజానికి ఎన్నికల్లో వ్యక్తిగత ఆరోపణలు చేయకుండా ఉండుంటే సమాజ సేవకుడిగా ముద్రపడిన శ్రీగణేష్‌కు గెలుపు దక్కేదని కంటోన్మెంట్ వాసులు పేర్కొంటున్నారు.

ప్రజల ఆశీస్సులతోనే ఘన విజయం



శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి



తలసానిని సన్మానిస్తున్న నేతలు

సనత్‌నగర్: నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతోనే తాను ఘన విజయం సాధించగలిగానని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మూడోసారి విజయం సాధించిన ఆయనను సోమవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద పార్టీ శ్రేణులు, అభిమానులు, వివిధ సంఘాల ప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. 2014 తర్వాతనే నియోజకవర్గ పరిధిలో అనేక అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలు ఎదుర్కొంటున్న అనేక దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. నియోజకవర్గ ప్రజలకు ఎవరికీ ఏ అవసరం వచ్చినా తాను నిరంతరం అందుబాటులో ఉంటానన్నారు. కార్పొరేటర్లు కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, హేమలత, మాజీ కార్పొరేటర్లు అరుణగౌడ్, శేషుకుమారి, నాయకులు బాల్‌రెడ్డి, పవన్‌కుమార్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేషన్‌రాజు, సంతోష్, లలితాచౌహాన్, హరిసింగ్, కరుణాకర్‌రెడ్డి, లక్ష్మీపతి, ప్రవీణ్‌రెడ్డి, సురేందర్‌సింగ్, కూతురు నర్సింహ శుభాకాంక్షలు తెలిపారు.

అత్తెల్లి అరుణగౌడ్ ఆధ్వర్యంలో..

రాంగోపాల్‌పేట్: సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీతో గెలుపొందిన మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. మారేడుపల్లిలోని ఆయన నివాసానికి పలువురు ప్రజాప్రతినిధులు వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం రాంగోపాల్‌పేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్‌తో పాటు డివిజన్‌కు చెందిన వివిధ బస్తీలు, కాలనీల నాయకులు తలసానిని సత్కరించారు.

అమీర్‌పేట: సనత్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను నియోజకవర్గవాసులు, నాయకులు, పార్టీ శ్రేణులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి ఆధ్వర్యంలో సోమవారం సత్యం థియేటర్ చౌరస్తాలో మిఠాయిలు పంచిపెట్టి బాణాసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో నేతలు గులాబ్‌సింగ్, ఎం.లలితాగోపీ చౌహాన్, హరిసింగ్ జాదవ్, కరుణాకర్‌రెడ్డి, పీయూష్‌గుప్తా, కూతురు నర్సింహ, కట్టబల్‌రాం పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల సంబరాలు



తుకారాంగేట్‌లో సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు

అడ్డగుట్ట: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన సందర్భంగా అడ్డగుట్ట డివిజన్ తుకారాంగేట్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మోహన్ నేతృత్వంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బ్యాండ్‌తో ర్యాలీ నిర్వహించి, టపాసులు పేల్చుతూ సంబరాలు చేసుకున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని ఆదరించిన ప్రజలందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నామని, దొరల పాలన పోయి ప్రజల పాలన వచ్చిందని కాంగ్రెస్ నేత మోహన్ పేర్కొన్నారు.

ఘనంగా క్యాథలిక్ బ్యాంకు సిల్వర్ జూబ్లీ వేడుకలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కార్డినల్ పూల ఆంథోని

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఎస్డీ రోడ్డులోని క్యాథలిక్ బ్యాంకు సిల్వర్ జూబ్లీ వేడుకలు సెయింట్ మేరీస్ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ ఆర్చ్ బిషప్, కార్డినల్ పూల ఆంథోని ముఖ్య అతిథిగా హాజరుకాగా బ్యాంకు పూర్వ అధ్యక్షులు, షేర్ హోల్డర్స్‌తో పాటు పెద్ద సంఖ్యలో ఖాతాదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్డిన్ పూల ఆంథోని మాట్లాడుతూ.. ఎన్నో కో ఆపరేటివ్ బ్యాంకులు వచ్చి కాలగమనంలో కలిసిపోయినా 25 ఏళ్లుగా ఆర్థిక క్రమశిక్షణతో ఖాతాదారులకు నాణ్యమైన సేవలను అందిస్తూ కొనసాగుతున్న క్యాథలిక్ బ్యాంక్ పయణం ఎంతో అభినందనీయం అన్నారు. అలాగే షేర్ హోల్డర్స్‌కు కూడా ఏ బ్యాంకు ఇవ్వనటువంటి డివిడెండ్‌ను అందిస్తూ ఖాతాదారులకు అత్యుత్తమ వడ్డీ రేట్లతో అందరి మన్ననలు అందుకుంటుందని కొనియాడారు. బ్యాంకు మరిన్ని శాఖలు, లక్షలాది ఖాతాదారులతో విస్తరించాలని ఆకాంక్షించారు. అలాగే బ్యాంకు పురోభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. బ్యాంకు సీఈవో రాజశేఖర ప్రసాద్ 25 ఏళ్లలో సాధించిన ప్రగతి, సాధించాల్సిన లక్ష్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు చైర్మన్ మోహన్‌రెడ్డి, ఫాదర్ ఏర్వ బాలశౌరి, కో ఆపరేటివ్ శాఖ జాయింట్ సెక్రటరీ రమాదేవి, ఎస్తేర్ రాణి, వైస్ చైర్మన్ బీ అంతయ్య పాల్గొన్నారు.

లాస్య విజయంతో 500 కొబ్బరి కాయలు కొట్టిన అభిమాని



పూజలు చేస్తున్న లాస్యనందిత



కొబ్బరికాయలు కొడుతున్న అశోక్

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్యనందిత ఎన్నికల్లో గెలిస్తే 500 కొబ్బరికాయలు కొడుతానని మొక్కిన ఓ అభిమాని తన మొక్కును తీర్చుకున్నాడు. మూడవ వార్డు మడ్‌ఫోర్ట్ అంబేడ్కర్ హట్స్‌కు చెందిన సాంబ అశోక్, లాస్యనందిత గెలిస్తే బస్తీలో ఉన్న రేణుకా ఎల్లమ్మ అమ్మవారి ఆలయంలో 500 కొబ్బరికాయలు కొడ్తానని మొక్కాడు. ఫలితాలు వెలువడిన అనంతరం ఆదివారం రాత్రి లాస్యనందితకు సమాచార మిచ్చి మడ్‌ఫోర్ట్‌కు ఆహ్వానించి ఆలయంలో పూజలు చేయించి ఆమెతో మొదటి కొబ్బరి కాయ కొట్టించి కార్యకర్తలతో కలిసి కొబ్బరి కాయలు కొట్టారు. 2018లో సాయన్న గెలిచిన అనంతరం వంద కొబ్బరి కాయలు కొట్టినట్లు అశోక్ తెలిపాడు. ఈ కార్యక్రమంలో నివేదిత, వెంకట రాముడు గుడి సేవాసులు పాల్గొన్నారు.

ఓడినా ప్రజలకు అందుబాటులో ఉంటా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీగణేశ్

కంటోన్మెంట్: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ ప్రజాక్షేత్రంలోనే ఉంటానని బీజేపీ అభ్యర్థి ఎన్. శ్రీగణేశ్ అన్నారు. సోమవారం పికెట్‌లోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కంటోన్మెంట్ నియోజకవర్గ ఎన్నికల ఫలితం నిరాశ పర్చినప్పటికీ, తనకు ఓటేసిన 42 వేల మందికి ధన్యవాదాలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, కేశవరెడ్డి, భానుక నర్మద మల్లికార్జున్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బీఎస్ శ్రీనివాస్ సహకారం మరువలేనిదన్నారు. తాను గతంలో శ్రీగణేశ్ ఫౌండేషన్ తరఫున చేపట్టిన సేవా కార్యక్రమాలను ఇకపై బీజేపీ ఆధ్వర్యంలోనే కొనసాగిస్తానని అన్నారు. బీఆర్‌ఎస్ నేతలు ప్రజలను ప్రలోభాలకు గురి చేయడంతో పాటు పథకాలు నిలిచిపోతాయన్న అసత్య ప్రచారం చేశారని ఆరోపించారు. ఈ సమావేశంలో విజయానంద్, సతీష్, బీఎస్ శ్రీనివాస్, అశోక్, విజయ్ పాల్గొన్నారు.

9 నుంచి చేనేత వస్త్ర ప్రదర్శన

శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఆధ్వర్యంలో శారీస్ ఆఫ్ ఇండియా పేరిట చేనేత వస్త్ర ప్రదర్శనను ఈ నెల 9 నుంచి ఐదు రోజులపాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వినయ్‌కుమార్, శ్రీనివాసరావు తెలిపారు. నాణ్యమైన, ఎక్కడా దొరకని బెనారస్ పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. చేనేత కళాకారుల కళా ఉత్పత్తులైన సిల్క్, కాటన్ వస్త్రాలతో పాటు డిజైనరీ చీరలు, ఫ్యాన్సీ వస్తువులు అందుబాటులో ఉంటాయన్నారు. నాణ్యతకు మారుపేరైన సిల్క్ గ్యాలరీలోని వస్త్రాలను మహిళలు సందర్శించాలని కోరారు.

ఒంటె మాంసం విక్రయించేందుకు యత్నించిన ముగ్గురి అరెస్టు

బంజారాహిల్స్: హకీంపేట కుంట సమీపంలో ఒంటి మాంసాన్ని అమ్మేందుకు ఏడు ఒంటెలను ఓ ప్రాంతంలో ఉంచగా సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి ఒంటెలకు విముక్తి కలిగించారు. నిందితులను ఫిలింనగర్ పోలీసులకు అప్పగించారు. వివరాలివీ... పారామౌంట్‌కాలనీ సమీపంలో మహ్మద్ ఇస్మాయిల్(30) బెస్ట్‌బీఫ్ షాప్ నిర్వహిస్తున్నాడు. తేలికగా డబ్బు సంపాదించేందుకు ఒంటె మాంసాన్ని విక్రయించాలని తన అనుచరులు మహ్మద్ సల్మాన్, సిరాజ్‌ఖాన్‌తో పథకం వేశారు. ఇందులో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి ఒంటెలను తీసుకొచ్చి టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. దాడులు నిర్వహించి నాలుగు ఒంటెలతో పాటు కత్తులు, తూనికల యంత్రాలు, ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ముగ్గురిని ఫిలింనగర్ పోలీసులు అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పడగ విప్పిన పాము.. పరుగులు తీసిన విద్యార్థులు

ఓయూ క్యాంపస్‌లో పాముల బెడదతో విద్యార్థులు బెంబేలెత్తుతున్నారు. సోమవారం ఎన్‌ఆర్‌ఎస్ హాస్టల్ ప్రవేశ ద్వారం వద్ద నాగుపాము పడగ విప్పి ఉండటం చూసిన విద్యార్థులు పరుగులు పెట్టారు. గతంలో ఇదే హాస్టల్‌లో పరిశోధన విద్యార్థికి పాము కాటేయగా సకాలంలో ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. హాస్టల్ భవనాల్లోకి పాములు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరారు. – ఉస్మానియా యూనివర్సిటీ

దివ్యాంగ రోగులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పిస్తున్న ప్రొ.వాల్యా

గాంధీ ఆస్పత్రి: వైద్యం కోసం వచ్చే దివ్యాంగ రోగుల పట్ల ప్రత్యేక జాగ్రత్త వహించి, మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని గాంధీ ఆస్పత్రి ఆర్థోపెడిక్ విభాగాధిపతి ప్రొఫెసర్ వాల్యా అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఆర్థోపెడిక్ సెమినార్ హాల్లో దివ్యాంగ హక్కుల చట్టం, దివ్యాంగ రోగులకు అందించాల్సిన వైద్యసేవలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై పీజీ వైద్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వాల్యా మాట్లాడుతూ.. శారీరక, మానసిక వైకల్యంతో బాధపడే దివ్యాంగుల కోసం ఐక్యరాజ్య సమితి మార్గదర్శక సూత్రాల మేరకు 2016లో ప్రత్యేక చట్టం రూపొందించినట్లు తెలిపారు. దివ్యాంగుల హక్కుల చట్టం–2016లో పొందుబర్చిన పలు అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పీజీ వైద్యులకు అవగాహన కల్పించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. పుట్టుక, ప్రమాదాల బారినపడి వైకల్యం పొందినవారి హక్కులకు భంగం కలగకుండా వైద్యసేవలు అందించాలని, శారీరక వైకల్యాన్ని బట్టి వివక్ష చూపవద్దని అన్నారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ విభాగ ప్రొఫెసర్లు సత్యనారాయణ, రవీందర్, పీజీ వైద్యులు పాల్గొన్నారు.



రవీంద్రనగర్‌లో కొనసాగుతున్న పైపులైన్ పనులు

పర్యవేక్షణ లేక.. పనులు ముందుకు సాగక!

- నత్తనడకన పైపులైన్ పనులు
- రాకపోకలకు ఇబ్బందులు
- పూర్తి చేయాలంటున్న ప్రజలు
- విస్మరిస్తున్న అధికారులు



పనులకు వాడుతున్న డస్ట్

లాలాపేట: తార్నాక డివిజన్ పరిధిలో ఇటీవల చేపట్టిన పైపులైన్ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సదరు కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా పనులు కొనసాగిస్తున్నారు. ఫలితంగా స్థానిక ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తార్నాక డివిజన్ రవీంద్రనగర్‌లో కొనసాగుతున్న పైపులైన్ పనులు ఒక్క అడుగు ముందుకు రెండడుగులు వెనక్కి అన్న చందంగా మారాయి. ఈ మార్గంలో ఉన్న పాఠశాల, రైల్వే జూనియర్, డిగ్రీ కళాశాలకు వెళ్లే విద్యార్థుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పైగా పైపులైన్ కోసం తవ్విన గుంతల్లో రాత్రి వేళల్లో స్థానికులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. నిత్యం రాకపోకలకు ప్రజలు కష్టాలు పడుతున్నా అధికారులెవరూ ఇటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నాణ్యత డొల్ల..



మురుగు నీటిలోనే పైపులు వేస్తున్న దృశ్యం

రూ. కోట్లలో ప్రజాధనం వెచ్చించి చేపట్టిన అభివృద్ధి పనులు కొనసాగుతున్న సమయంలో అధికారులు గానీ, వర్క్ ఇన్‌స్పెక్టర్‌గాని అందుబాటులో ఉండటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో పనుల్లో ఏమాత్రం నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదన్నారు. మురుగు నీటి ప్రవాహాన్ని దారి మళ్లించకుండానే బురదలోనే పైపులైన్లు వేస్తున్నారు. నిర్మాణంలో ఇసుకకు బదులుగా వైట్ డస్ట్‌నే వాడుతున్నారు. దీంతో భవిష్యత్‌లో సమస్య తలెత్తే అవకాశం ఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పైపులైన్ల పనులపై దృష్టి సారించి త్వరితగతిన పూర్తయ్యేలా చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

పద్మారావుగౌడ్‌కు అభినందనల వెల్లువ

లాలాపేట: సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలుపొంది, హ్యాట్రిక్ సాధించిన తీగుళ్ల పద్మారావు గౌడ్‌కు నేతలు, కార్యకర్తలు, అభిమానుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్‌రెడ్డి పద్మారావుగౌడ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. సికింద్రాబాద్‌తో పాటు గ్రేటర్ హైదరాబాద్ బీఆర్‌ఎస్ గులాబీ జెండాకు అడ్డాగా మారిందన్నారు.





అభివృద్ధికే జై కొట్టారు!

- సనత్‌నగర్ చరిత్రలోనే తొలిసారిగా హ్యాట్రిక్
- పెరిగిన బీజేపీ బలం
- కాంగ్రెస్ కొంపముంచిన స్థానికత

సనత్‌నగర్: సనత్‌నగర్ ప్రజానీకం అభివృద్ధికే మళ్లీ పట్టం కట్టారు. నిత్యం ప్రజల్లో ఉంటూ వారి అవసరాలను తీర్చే నేతను ప్రజలు నెత్తిన పెట్టుకుంటారని మరోసారి రుజువు చేశారు. ఒకటా..రెండా..గడిచిన తొమ్మిదిన్నర ఏళ్లలో రూ.1400 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టిన తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కే పట్టం కట్టి అభివృద్ధి ప్రదాతకు మరోసారి జైకొడుతూ 41827 ఓట్ల ఆధిక్యాన్ని చేతికందించారు. సనత్‌నగర్ నియోజకవర్గ చరిత్రలో మునుపెన్నడూ ఏ అభ్యర్థి వరుసగా మూడుసార్లు గెలిపించిన దాఖలాలు లేవు. అలాంటిది ఈ సారి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు హ్యాట్రిక్ విజయాన్ని కట్టబెట్టి రికార్డును నెలకొల్పారు. నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ప్రారంభం నుంచి చివరి వరకు బీఆర్‌ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆధిక్యాన్ని కొనసాగిస్తూ వచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పవనాలు వీచినప్పటికీ ఇక్కడ మాత్రం అభివృద్ధిని చూసి ఓటేసిని జనం భారీ మెజార్టీతో తలసానిని గెలిపించారు. ఎన్నికల ప్రచారంలో కూడా ఆయన ఎక్కడికెళ్లినా తాను చేసిన అభివృద్ధినే ప్రచారాస్త్రంగా చేసుకున్నారు. చివరకు అభివృద్ధి మంత్రం పనిచేసి ఆయనకు విజయాన్ని చేకూర్చారు.

పుంజుకున్న కమలం..

బీజేపీ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డికి పోలైన ఓట్లను పరిశీలిస్తే ఆ పార్టీ బలం పుంజుకుందనే చెప్పాలి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసిన భవర్‌లాల్‌వర్మకు 14247 ఓట్లు రాగా ఈ సారి ఆ పార్టీ అభ్యర్థి మర్రికి 30730 ఓట్లు పోలయ్యాయి. అప్పటితో పోలిస్తే బీజేపీకి రెట్టింపు స్థాయిలో ఓట్లు పోలయ్యాయి. అయితే బీజేపీకి సంప్రదాయ ఓటు బ్యాంక్‌తో పాటు మర్రి శశిధర్‌రెడ్డి వ్యక్తిత్వం ఆధారంగా భారీగా ఓట్లు పడ్డాయనే రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. దీనికి తోడు యూపీ సీఎం యోగి ఆదిత్య రోడ్ షో కూడా కలిసొచ్చి ఓటింగ్ శాతం పెరగడానికి దోహదపడిందనే చెప్పాలి.

చతికిలపడ్డ హస్తం..

మొదటి రౌండ్ నుంచే కాంగ్రెస్ పార్టీ ఇక్కడ చతికిలపడింది. దీంతో ఆ పార్టీ అభ్యర్థి కోట నీలిమ తొలి రౌండ్‌లోనే ఓటమిపై అంచనాకు వచ్చేసి కౌంటింగ్ హాల్ నుంచి వెళ్లిపోవడం గమనార్హం. అయితే స్థానికేతురాలికి టికెట్ కేటాయించడం, కేడర్‌ను పూర్తి స్థాయిలో ఆమె నమ్మకపోవడం, ఎవరెవరు ఎలాంటి వారో తెలుసుకోలేకపోవడం, కేడర్ పట్ల అనుచితంగా వ్యవహరించారనే విమర్శలు, సీనియర్ నేతలను అంతగా పట్టించుకోలేకపోవడం, ముఖ్యంగా మిగతా ఇద్దరితో పోలిస్తే మీడియా ప్రచారానికి అంతగా ప్రాధాన్యం ఇవ్వకపోవడం..ఇలా కర్షుడికి చావుకు సవాలక్ష కారణాలు అన్నట్లుగా అనేక కారణాలు ఆమెకు ఓటమి రుచి చూపించాయి.